## క్లుప్తంగా

### పరిసరాల శుభ్రత పాటించండి

డోన్ : ప్రతిఒక్కరూ పరిసరాల శుభ్రత పాటించాలని, అంటువ్యాధులకు దూరంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణ పరిధిలోని 26వ వార్డులో డీఈ రసూల్, ఏఈ సురేష్, శానిటరీ ఇన్స్పెక్టర్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో గురువారం ఆయన స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలో మురుగు సవ్యంగా పారేందుకు చెత్త, చెదారాన్ని అడ్డువేయరాదని సూచించారు. అదేవిధంగా పన్ను సకాలంలో చెల్లించాలని, తద్వారా మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు.

### శుభకార్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని హనుమంతుగుండంకు చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు పాట్టిపాటి గంగరాజు యాదవ్ కుమారుడు సురేష్ బాబు వివాహ వేడుకకు గురువారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను ఎమ్మెల్యే ఆశీర్వాదించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు సత్తిగారి రామిరెడ్డి, యాపర్ల వెంకటేశ్వరరెడ్డి, బాలిరెడ్డి, మురళీ, సలీం, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

### సంతాపం



షాషావలిని ఓదార్చుతున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణం బీసీ కాలనీకి చెందిన వైఎస్సార్సీపీ యువజన విభాగం సభ్యుడు షాషావలి తల్లి సలిమాబీ(56) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్సీపీ యువనేత కాటసాని ఓబులరెడ్డి సలిమాబీ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. షాషావలిని ఓదార్చారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ యువజన మండల అధ్యక్షుడు అత్తార్అఖిల్ హుస్సేన్, పాపిరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్‌హుస్సేన్, షేక్షా, వలి, రసూల్, అల్తాఫ్, ముక్తియార్, హమీద్, శ్రీకాంత్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

### నిత్యావసర సరుకుల పంపిణీ



సరుకులను అందజేస్తున్న నూర్ అహ్మద్

బేతంచెర్ల: బేతంచెర్ల మైనార్టీ వెల్ఫేర్ కమిటీ సహకారంతో నిరుపేద కుటుంబానికి మూడు నెలలకు సరిపడే నిత్యావసర సరుకులను మండల ఖాజీ నూర్ అహ్మద్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో బేతంచెర్ల మైనార్టీ వెల్ఫేర్ కమిటీ ప్రెసిడెంట్ షేక్షావలి, వైస్ ప్రెసిడెంట్ షేక్షన్, సభ్యులు వలీ, సలాం, సద్దాం, మహబూబ్‌వలీ, ఖలీల్, దివాన్ పాల్గొన్నారు.

### నాణ్యమైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



ట్రాన్స్‌పార్మర్‌కు పూజ చేస్తున్న ఏఈ

డోన్ టౌన్ : ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని ఏఈ నాగేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని చిన్న మల్కాపురం సబ్ స్టేషన్‌లో గత కొద్ది రోజులుగా ఏర్పాటు పనులు చేపట్టిన అదనపు పవర్ ట్రాన్స్‌పార్మర్ పనులు పూర్తి కావడంతో గురువారం పూజలు నిర్వహించి విద్యుత్ సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ అదనపు పవర్ ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటుతో చిన్న మల్కాపురం, పెద్ద మల్కాపురం, కమలాపురం, వలిసెల, ఎర్రగుంట్ల గ్రామాలకు, ఫ్యాక్టరీలకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. లైన్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు, లైన్‌మెన్ కృష్ణమోహన్, ఆపరేటర్ వెంకటేశ్వర్లు, కంట్రాక్టరు తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

### నారా భువనేశ్వరి పరామర్శ

బేతంచెర్ల: నిజం గెలవాలి కార్యక్రమంలో భాగంగా గురువారం మాజీ సీఎం చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలంలోని హెచ్.కొట్టాల, గోరుమానుకొండ గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ కొట్టాలలో మరణించిన టీడీపీ అభిమాని పువ్వాడి నాగేశ్వరరావు, గోరుమాను కొండలో మరణించిన టీడీపీ అభిమాని తెలుగు తుపాకుల వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి సందేశ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్‌రెడ్డి, నంద్యాల పార్లమెంట్ అభ్యర్థి బైరెడ్డి శబరి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ తదితరులు పాల్గొన్నారు.

### మూర్ఛవ్యాధితో వ్యక్తి మృతి

ఆదోని అర్బన్: డోన్ పట్టణానికి చెందిన రాజేంద్రప్రసాద్ (46) కోర్టు పనిపై ఆదోనికి వచ్చి మృత్యువాత పడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ గోపీ తెలిపిన వివరాల మేరకు.. పొలం విషయంపై అడ్వకేట్‌తో మాట్లాడేందుకు ఆదోనికి వచ్చారని, స్థానిక కోర్టు సమీపంలో మూర్ఛవ్యాధితో మృతిచెందినట్లు చెప్పారు. మృతుడి భార్య ప్రమీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఈ దివ్యాంగుని పేరు రాజగోపాల్. కోవెలకుంట్ల పట్టణంలోని చౌడమ్మ గుడి వద్ద నివాసం ఉంటున్నాడు. అతి కష్టం మీద అడుగులో అడుగు వేసుకుంటూ పింఛన్ కోసం సచివాలయానికి బయలుదేరాడు. పెరాలసిస్‌తో మాటలు కూడా సరిగారావు. ఒక చేయి, కాలు పనిచేయవు. అవిటితనంతోనే ఇంటి నుంచి ఎవరి సాయం లేకుండా సచివాలయానికి పడుతూ లేస్తూ వెళ్లాల్సిన పరిస్థితి దాపరించింది. ఎవరినైనా వదిలిపెట్టమని అడుగుదామనుకుంటే మాటలు సరిగా రావు. ఒక్కడే అడుగులో అడుగు వేసుకుంటూ సచివాలయం వద్దకు వెళ్లి పింఛన్ తీసుకున్నాడు. ప్రతి నెలా ఇంటి వద్దనే పింఛన్ తీసుకుంటున్న ఈ దివ్యాంగుడికి గ్రామ సచివాలయంలో పొందేందుకు పడిన కష్టం వర్ణనాతీతం.



# పింఛన్ పంపిణీకి ‘చంద్ర’గ్రహణం

- నారా చంద్రబాబు అక్కసుతో అవ్వాతాతలకు తప్పని అగచాట్లు
- మండుటెండలో పండుటాకుల పాట్లు
- చంద్రాబాబుకు శాపనార్థాలు పెడుతున్న పింఛన్‌దారులు



లబ్ధిదారులకు పింఛన్ పంపిణీ చేస్తున్న సిబ్బంది



వేలిముద్ర తీసుకుంటున్న సచివాలయ ఉద్యోగి

కోవెలకుంట్ల: ప్రతినెలా ఒకట తేదీన ఠంచన్‌గా జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమానికి చంద్రబాబునాయుడు రూపంలో ‘చంద్ర’గ్రహణం పట్టుకుంది. వలంటీర్లపై ఉన్న కక్షను చంద్రబాబు అవ్వాతాతలపై తీర్చుకున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు అండ్ కో ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి ఇళ్ల వద్దనే పింఛన్ పంపిణీని అడ్డుకున్నారు. ఫలితంగా పింఛన్‌దారులు గ్రామ సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. సచివాలయాలకు మండుటెండలో వచ్చి పింఛన్లు తీసుకునేందుకు అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు పడరాని పాట్లు పడుతున్నారు. అసహనానికి గురవుతున్న అవ్వాతాలు చంద్రబాబుపై దుమ్మెత్తిపోస్తున్నారు. మాగోడు తగలక తప్పదని శాపనార్థాలు గుప్పిస్తున్నారు. బనగానపల్లె మండలంలో 12,749 మంది, కోవెలకుంట్ల - 6,076, సంజామల - 5,319, కొలిమిగుండ్ల - 7,224, అవుకు మండలంలో 6,875 మందికి ఏప్రిల్ పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంది. ఒక్కో సచివాలయం పరిధిలో 500లకు పైగా పింఛన్‌దారులు ఉన్నాయి. సచివాలయంలో పనిచేసే సిబ్బందికి ఒక్కొక్కరికి కొన్ని క్లస్టర్లు కేటాయించి పింఛన్లు పంపిణీ చేసేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవడంతో లబ్ధిదారులు కాస్త ఊపిరి పీల్చుకున్నారు.

బనగానపల్లె : చంద్రబాబునాయుడు రాజకీయ కుట్రలకు అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులతోపాటు ఇతర పింఛన్ లబ్ధిదారులు పింఛన్ సొమ్ము తీసుకునేందుకు అష్టకష్టాలుపడుతున్నారు. మండుటెండలో సచివాలయాలకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అవ్వాతాతలు, దివ్యాంగులు. ప్రతి నెలా ఇళ్ల వద్దనే పింఛన్ సొమ్ము తీసుకున్న లబ్ధిదారులు బాబు తీరును తప్పుపడుతున్నారు. పనులు మానుకుని రావాల్సి వస్తుందని మరికొందరు వితంతువులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆటో చార్జీకే రూ.200 వరకు చెల్లించాల్సిన దుస్థితి నెలకొందని మరికొందరు పింఛన్‌దారులు వాపోయారు. టీడీపీ ప్రభుత్వంలో పడిన ఇబ్బందులు మళ్లీ బాబే గుర్తు చేస్తున్నారని శాపనార్థాలు పెడుతున్నారు వృద్ధులు,వితంతువులు దివ్యాంగులు.

కొలిమిగుండ్ల: సచివాలయాల్లో సామాజిక పింఛన్ల పంపిణీ కొనసాగుతుంది. గురువారం ఉదయం తొమ్మిది గంటల నుంచి సచివాలయ ఉద్యోగులు పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. మండలంలో 16 గ్రామ సచివాలయాల పరిధిలో 7222 పింఛన్‌లు ఉండగా ఇప్పటి వరకు 68శాతంకు పైగానే పంపిణీ పూర్తయింది. వయసు మీద పడి నడవ లేని స్థితిలో ఉన్న వృద్ధులు పింఛన్ కోసం సచివాలయాల వద్దకు చేరుకునేందుకు అష్టకష్టాలు పడాల్సి వచ్చింది.

### కొనసాగిన పింఛన్ల కష్టాలు



పింఛన్ కోసం ఆటోలో వచ్చిన మానసిక దివ్యాంగుడు

డోన్ టౌన్ : చంద్రబాబు రాజకీయ కుతంత్రాలకు పింఛన్‌దారులు పడరానిపాట్లు పడుతున్నారు. ప్రత్యేకించి దివ్యాంగులు, వృద్ధులు మండుటెండలో సచివాలయాలకు వచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రతినెలా ఇంటి వద్దనే పింఛన్ అందుకున్న లబ్ధిదారులు నానా కష్టాలు పడుతూ సచివాయాలకు వస్తున్నారు. మండుటెండలో సచివాయాలు చేరుకుంటున్న వృద్ధులు, దివ్యాంగులు నీరసిస్తూ బాబుకు శాపనార్థాలు పెడుతున్నారు. డోన్ పట్టణ పరిధిలోని శ్రీనివాస నగర్‌కు చెందిన బుద్ధిమాంద్యం దివ్యాంగుడు సచివాలయానికి ఆటలో వచ్చి నిరీక్షించారు. ఇక్కడి రావడానికి రూ. వంద చెల్లించాల్సి వచ్చిందని ఆ దివ్యాంగుడి సహాయకుడు వాపోయాడు. తమను ఇబ్బంది పెడితే బాబుకు వచ్చేదేమిటో అర్థం కావడం లేదని విమర్శలు గుప్పించారు పింఛన్ లబ్ధిదారులు.

### ఉదయం నుంచి ఎదురు చూస్తున్నా...



పింఛన్ కోసం సచివాలయం వద్ద ఉదయం నుంచి ఎదురు చూస్తూనే ఉన్నా. ఇలాంటి పరిస్థితి వస్తుందని ఊహించలేదు. చంద్రబాబుకు ఇది తగదు. ప్రతి నెల వలంటీర్ ఇంటి దగ్గరికి వచ్చి పింఛన్ అందించేవాడు. ఇప్పుడు మళ్లీ నిరీక్షణ తప్పలేదు. మా బాధలు దేవునికి తెలుసు. మాలాంటి ముసలివాళ్లను చూస్తే కనికరం రాదా చంద్రబాబు. వృద్ధులను కనీసం ఓటు అడిగే హక్కును కోల్పోయావు చంద్రబాబు.

– చిన్న ఉస్సేని, ఆల్వకొండ, సంజామల మండలం

### చంద్రబాబు తీరేమీ బాగోలేదు...



పింఛన్ పంపిణీ విషయంలో చంద్రబాబు తీరేమీ బాగోలేదు. పింఛన్‌దారులను చాలా ఇబ్బంది పడుతున్నారు. వలంటీర్లు ఒకటవ తేదీనే ఇంటి వద్దకు వచ్చి పింఛన్ సొమ్ము ఇవ్వడాన్ని బాబు ఓర్వలేకపోతున్నాడు. ఎండలో సచివాయాలకు వచ్చేందుకు పడరానిపాట్లు పడుతున్నాం. బాబు మూల్యం చెల్లించుకుంటారు.

– నాగేశ్వరరావు,కొండపేట బనగానపల్లె

### మమ్మల్ని కష్టపెడితే బాబుకు వచ్చే లాభం ఏమిటో



ముసలితనంలో మమ్మల్ని ఇలా కష్ట పెట్టడం వల్ల చంద్రబాబుకు వచ్చిన లాభం ఏమిటో అర్థం కావడం లేదు. ప్రతి నెలా వలంటీర్లు ఇంటి వద్దకు వచ్చి పింఛన్లు ఇచ్చేవారు. ఈ నెల నుంచి గ్రామ సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకోవాలని చెప్పారు. కోవెలకుంట్లలో ఉన్న సంతపేట నుంచి సచివాలయానికి అతికష్టం మీద వెళ్లి వృద్ధాప్య పింఛన్ తీసుకోవాల్సి వచ్చింది. బాబు తీరు ఏ మాత్రం బాగోలేదు.

– రహమూన్‌బీ, వృద్ధురాలు, కోవెలకుంట్ల

### టీడీపీ వీడి వైఎస్సార్సీపీలో చేరిక



చనుగొండ్ల శివారెడ్డికి వైఎస్సార్సీపీ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని సబ్ స్టేషన్ ఏరియాకు చెందిన టీడీపీ నాయకుడు చనుగొండ్ల శివారెడ్డి గురువారం ఆ పార్టీ వీడి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరారు. ఎమ్మెల్యే స్థానిక స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో చనుగొండ్ల శివారెడ్డికి ఎమ్మెల్యే కాటసాని వైఎస్సార్సీపీ కండువవేసి సాదారంగా ఆహ్వానించారు. చనుగొండ్ల శివారెడ్డికి సముచిత స్థానం కల్పిస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని తెలిపారు. కార్యక్రమంలో 83వ బూత్ కన్వీనర్ ఆకుల జస్వంత్‌రెడ్డి, అన్నవరం రాజేష్‌రెడ్డి, ఎర్రగుడిసుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జువాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఎస్ మహమ్మద్‌గౌస్ గురువారం ఉచిత స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు బాబునాథ్,ఉమామహేశ్వరరెడ్డి, రవికుమార్, వహిదా,కౌసల్య తదితరులు పాల్గొన్నారు.

### సోషల్ మీడియా పోస్టింగ్‌లపై అప్రమత్తంగా ఉండాలి

సంజామల: సోషల్ మీడియా పోస్టింగ్‌లు, షేర్ చేయడంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ రమేష్ రెడ్డి సూచించారు. ఇతరుల మనోభావాలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టే విధంగా పోస్టులు చేయకుడదన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోస్ట్, షేర్ చేసినా వారితోపాటు అడ్మిన్‌ను కూడా శిక్షకు అర్హుడని ఎస్ఐ హెచ్చరించారు.

## పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి సారించాలి

- సీఐ ప్రవీణ్‌కుమార్



నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ ప్రవీణ్‌కుమార్

డోన్ టౌన్ : తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తన, నడవడికలపై దృష్టి సారించాలని పట్టణ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం అదుపులోకి తీసుకున్న గంజాయి విక్రేతల అరెస్టును చూపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి కేసులో అరెస్టు అయిన శ్రీరాంనగర్‌కు చెందిన నాయకల్లు భరత్ చంద్ర, బోయ ఉదయ్ విద్యార్థులు అని చెప్పారు. వీరు మత్తు పదార్థాలకు అలవాటుపడి తోటి విద్యార్థులకు రెండేళ్లుగా గంజాయిని విక్రయిస్తున్నారన్నారు. వీరి తల్లిదండ్రులు దృష్టి సారించకపోవడంతోనే చెడు వ్యసనాలకు అలవాటు పడ్డారన్నారు. వీరికి గంజాయిని సరఫరా చేసే పత్తికొండ నిందితుని కోసం గాలింపు చర్యలు చేపట్టామని, త్వరలో అరెస్టు చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి, ఎఎస్ఐ భాస్కర్, కానిస్టేబుళ్లు చాంద్‌బాషా, హరి పాల్గొన్నారు.

## టీడీపీని వీడి 50 కుటుంబాలు వైఎస్సార్సీపీలోకి చేరిక



బుగ్గన అర్జున్ రెడ్డి సమక్షంలో వైఎస్సార్సీపీలో చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు

ప్యాపిలి: మండల పరిధిలోని కలచట్ల గ్రామానికి చెందిన 50 కుటుంబాలు గురువారం టీడీపీని వీడి వైఎస్సార్సీపీలో చేరాయి. డోన్ పట్టణంలో ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్ అమర్నాథ్ సమక్షంలో ఈ మేరకు వారు వైఎస్సార్సీపీ కండువా కప్పుకున్నారు. గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు డైలీ శివలింగ, శ్రీరాములు, ధనుంజయ, ప్రహల్లాద, క్రిష్ణ, లాలు, గూడుష, శివ, లక్ష్మినారాయణ, గంట నాగేంద్ర, అజయ్, రమేశ్ తదితరులతో పాటు మరో 40 కుటుంబాలు టీడీపీని వీడాయి. వైఎస్సార్సీపీలోకి చేరిన వారికి బుగ్గన అర్జున్ అమర్నాథ్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో కలచట్ల వైఎస్సార్సీపీ ఇంచార్జ్ బోరెడ్డి కృష్ణారెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు నాగరాజు, బాలాంజీ, రామ్మూర్తి, జయరామయ్య, పెద్దయ్య, అనుమన్న, నాగరాజు, కొండయ్య, బీమన్న తదితరులు పాల్గొన్నారు.


## వైఎస్సార్సీపీని మరోసారి ఆశీర్వదించండి



కాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న కాటసాని ఓబులరెడ్డి

కొలిమిగుండ్ల: త్వరలో జరుగనున్న సాధారణ ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్సీపీని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు ఓబులరెడ్డి ప్రజలను కోరారు. గురువారం సాయంత్రం కొలిమిగుండ్ల ఎస్సీకాలనీ, జమ్ములమడగు క్రాస్ రోడ్డులోని కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా ఎమ్మెల్యే కాటసాని కొలిమిగుండ్ల మండలంలో చేసిన అభివృద్ధి విశదీకరించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయితే మరిన్ని సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శివరాయుడు, ఎంపీటీసీ సభ్యుడు వెంకట రమణ, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వర రెడ్డి, నాయకులు పేరం నందకిషోర్‌రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, బీగాల వెంకటసుబ్బయ్య, ఎంకె నాయుడు, నాగేశ్వరరావు, రామచంద్రుడు, శ్రీను, అంజి, జయరాజ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన రాతి దూలం పోటీలు



రాతి దూలం లాగుతున్న వృషభరాజములు

బనగానపల్లె రూరల్ : మండలంలోని టంగుటూరులో పెద్దమ్మ జాతర ముగిశాక నిర్వహించే 16వ రోజు పండుగ సందర్భంగా బుధవారం ప్రారంభమైన అఖిల భారత ఒంగోలు జాతి వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు గురువారం ముగిశాయి. వెల్దుర్తి మండలం కలుగొట్లకు చెందిన రమేష్‌నాయుడు వృషభాలు మొదటి స్థానం, కర్నూలు జిల్లా పి రుద్రవరం గ్రామానికి చెందిన యల్లగౌడ్ వృషభాలు రెండవ స్థానం, వైఎస్సార్ కడప జిల్లా దాసరిపల్లె గ్రామానికి చెందిన మొలకల చిన్నకొనయాదవ్ మూడవ స్థానం కైవసం చేసుకున్నాయి. అదేవిధంగా ఓర్వకలు మండలానికి చెందిన సుధాకర్ వృషభాలు నాల్గవ, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ఏ కోడూరు గ్రామానికి చెందిన చాగంటి నాగ మోహన్‌రెడ్డి వృషభాలు ఐదవ, వైఎస్సార్ కడప జిల్లా దాసరిపల్లెకు చెందిన బి సుదర్శన్, నంద్యాలకు చెందిన ఎస్ అల్లా బకాష్ వృషభాలు ఆరవ, నంద్యాల జిల్లాకు చెందిన బర్రెల గురుచరణ్, వైఎస్సార్ కడప జిల్లా దాసరిపల్లెకు చెందిన ధీరజ్ వృషభాలు ఏడవ స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యాజమాన్యాలక దాతల సహకారంతో వరుసగా రూ.50 వేలు, రూ.40 వేలు రూ.30వేలు,రూ.20వేలు,రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

### మంచినీటిని వృథా చేయొద్దు

కొలిమిగుండ్ల: వేసవిని దృష్టిలో ఉంచుకొని గ్రామాల్లో ప్రజలు మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడాలని ఎంపీడీఓ సాయికృష్ణ సూచించారు. గురువారం ఆయన ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నీటి ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామాల్లో డప్పు వేయించామన్నారు. చాలా చోట్ల మినీ వాటర్ ట్యాంకర్లు, పబ్లిక్ కుళాయిల వద్ద వాహనాలు శుభ్రం చేస్తున్నారన్నారు. ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. మంచినీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ వాడాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండలకు బయట తిరగవద్దని పేర్కొన్నారు.

### వైఎస్సార్సీపీలోనే కొనసాగుతా

బేతంచెర్ల: వైఎస్సార్సీపీలోనే కొనసాగుతానని మండల పరిధిలోని తవిసి కొండ గ్రామానికి చెందిన తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానిక వైఎస్సార్సీపీ కార్యాలయంలో గురువారం నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, కౌన్సిలర్ చింతల నాగిరెడ్డి సమక్షంలో తిరుమలేశ్వర్‌రెడ్డి వైఎస్సార్సీపీ కండువా కప్పుకున్నారు. బుధవారం మా గ్రామ పర్యటనకు వచ్చిన డోన్ టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్య ప్రకాశ్‌రెడ్డితో ఉన్న పాత పరిచయం కారణంగా మాట్లాడదామంటే అక్కడకు వెళ్లానని తిరుమలేశ్వర్‌రెడ్డి తెలిపారు. అయితే నాకు ఇష్టం లేకపోయినా టీడీపీ కండువా వేశారన్నారు.

### మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు 2023-24లో ఒలంపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు స్కూల్ ప్రిన్సిపల్ రామలక్ష్మీ బుధవారం తెలిపారు. నేషనల్ సైన్స్ ఒలంపియాడ్ పరీక్షల్లో 7వ తరగతికి చెందిన బాలజీనాయక్, 9వ తరగతికి చెందిన బి వర్షిణి, 10వ తరగతికి చెందిన ఎం గౌతమి ప్రతిభ చాటారన్నారు. అలాగే ఇంటర్నేషనల్ ఇంగ్లిష్ ఒలంపియాడ్ పరీక్షల్లో 7వ తరగతి ఆర్ బాలజీనాయక్, 9వ తరగతి హెచ్ సాయిచరణ్‌తేజ, జీ గౌస్‌మొహీద్దిన్ ప్రతిభ చూపారన్నారు. ఇంటర్నేషనల్ మేథమ్యాటిక్స్ పరీక్షల్లో 7వతరగతికి చెందిన ఆర్ బాలజీ నాయక్, ఎం చైతన్య దీప్తు, విజయకుమార్, 8వ తరగతికి చెందిన వై సాయి చేతన్, 9వ తరగతికి చెందిన హెచ్ సాయిచరణ్‌తేజలు ఉత్తమ ప్రతిభకబరచి బంగారు పతకాలు, ప్రశంసా పత్రాలు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

### వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించాలి



మహిళతో మాట్లాడుతున్న శ్రీరాములు

డోన్ రూరల్ : వైఎస్సార్సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు ప్రజలను కోరారు. మండల పరిధిలోని గుండాల, కోట్రాయి గ్రామాలలో గురువారం ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు రామచంద్రుడు, సొసైటీ బ్యాంక్ డైరెక్టర్ తిరుమల్‌రెడ్డి, క్రిష్ణమూర్తి, నాయకులు సోమేష్ యాదవ్, కేశవులు, అచ్చన్న, వెంకటయ్య, సుంకన్న, రవి, మనోహర్, గుర్రప్ప, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

## వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి పట్టం కట్టండి



31వ వార్డు ప్రజలతో బుగ్గన అర్జున్‌రెడ్డి

డోన్ : అర్హతే ప్రామాణికంగా అన్నివర్గాలకు సంక్షేమ పథకాలు అందజేసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో మరోమారు పట్టం కట్టాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి తనయుడు బుగ్గన అర్జున్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ ప్రజలకు పిలుపునిచ్చారు. పట్టణ పరిధిలోని 31వ వార్డులో గురువారం కౌన్సిలర్లు పాలుట్ల రఘురాం, మేకల విమల, ఆర్ రమణల ఆధ్వరంలో వారు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని వారు ప్రజలకు వివరించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయడం ద్వారా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసుకోవచ్చని, సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బుగ్గన అర్జున్ రెడ్డిని ఆర్యవైశ్య యువజన సంఘం మాజీ అధ్యక్షుడు బచ్చు చక్రి ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నంద్యాల జిల్లా బీసీ విభాగం అధ్యక్షుడు పోస్తుపసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, నాయకులు మేడా రఘు, వెంగల్‌రెడ్డి, మిట్టా రవి, ఎల్లేశ్వర్, వడ్డె రంగస్వామి, పెయింటర్ వెంకటేష్, ప్రతాప్‌రెడ్డి, కోట్రాయి సుంకన్న, దుబాయ్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మంచి చేసిన ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

- వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించండి
- కర్రా గిరిజారెడ్డి, కాటసాని మేధశ్రీరెడ్డి



కోవెలకుంట్లలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కర్రా గిరిజారెడ్డి, కాటసాని మేధశ్రీరెడ్డి

కోవెలకుంట్ల: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలకు మంచి చేసిన వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి త్వరలో జరగబోవు ఎన్నికల్లో మద్దతు ఇచ్చి పట్టం కట్టాలని ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కోడలు కాటసాని మేధశ్రీరెడ్డి కోరారు. గురువారం కోవెలకుంట్ల పట్టణంలోని సీతారాంనగర్, ఆటోనగర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోపిరెడ్డి వెంకటలక్ష్మమ్మ, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, మండల ఉపాధ్యక్షురాలు షాజహాన్‌తో కలిసి వారు ఇంటింటి ప్రచారం చేశారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు పోచా బ్రహ్మానందరెడ్డి, కాటసాని రామిరెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి నెల 1వ తేదీన ఇంటి వద్దకు వలంటీర్ల ద్వారా ఫించన్ల పంపిణీ చేపడుతుండగా చంద్రబాబు కుట్రపన్ని అడ్డుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మరోసారి ప్రజలను మోసం చేసేందుకు అబద్ధపు హామీలతో ప్రజల్లోకి వస్తున్నారని, వారి మాటలు నమ్మి మోసపోవద్దని కోరారు. కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, న్యాయ విభాగ జిల్లా కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు గజ్జెలరెడ్డి, పెద్దిరెడ్డి, పత్తి మనోహర్, గువ్వల రామకృష్ణారెడ్డి, సుబ్బయ్య, అక్బర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి బుగ్గనకు హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దాం



మహిళలతో మాట్లాడుతున్న బుగ్గన అర్జున్‌రెడ్డి

ప్యాపిలి: డోన్ వైఎస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించి హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దామని మంత్రి తనయుడు బుగ్గన అర్జున్ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రాచర్లలో గురువారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ బోరెడ్డి శ్రీరామిరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, ఏపీ ఐబీసీ డైరెక్టర్ బోరెడ్డి పుల్లారెడ్డి, జేసీఎస్ కన్వీనర్ బొర్రా మల్లికార్జున రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో మంత్రి చేసిన అభివృద్ధి పనులు కనిపిస్తున్నాయని ఈ సందర్భంగా బుగ్గన అర్జున్‌రెడ్డి గుర్తు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ నాయకులు దివాకర్ రెడ్డి, రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి సీఎం పెద్దపీట



సీతారాపురం గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి

బేతంచెర్ల : పేదల సంక్షేమానికి వైఎస్సార్సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, గిడ్డంగుల శాఖ రాష్ట్ర డైరెక్టర్ బాబుల్‌రెడ్డి, వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ తెలిపారు. గురువారం మండల పరిధిలోని సీతారామపురంలో సర్పంచ్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల తీరు, చేసిన అభివృద్ధిని వివరించారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్సీపీ అభ్యర్థులను గెలిపించాలని వారు ప్రజలను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ తిరుమలేశ్వరరెడ్డి, గోరుమానుకొండ సర్పంచ్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎద్దులన్న, రాముడు, నాగేశ్వరరావు, నాగేంద్ర, కేశవరెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.